

కామారెడ్డిలోని కంకర మిషన్

సీనరైజ్.. నిధులు ఏవీ?

- జిల్లాలో ఇసుక, కంకర, మొరం తవ్వకాలు
- 'స్థానిక' సంస్థలకు చేరని రాయల్టీ సొమ్ము
- గాంధారి, తాడ్వాయి ప్రాంతాల్లో ఇతర గనుల క్వారీలు
- క్వారీల్లో కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్న కాంట్రాక్టర్లు
- ప్రభుత్వానికి మాత్రం అంతంత మాత్రంగానే పన్నుల చెల్లింపు
- క్వారీల రూపంలో వచ్చే సీనరైజ్ బాధిత గ్రామాలకు చేరని నిధులు
- ప్రభుత్వం నుంచి గత ఎనిమిదేళ్లుగా విడుదల కాని రాయల్టీ నిధులు

కామారెడ్డి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్వారీల ద్వారా ప్రభుత్వానికి పన్ను రూపేనా కోట్లాది రూపాయలు చేరుతున్నా బాధిత గ్రామాలకు మాత్రం ప్రభుత్వం నుంచి సీనరైజ్ నిధులు విడుదల కావడం లేదు. గత ఐదేళ్లుగా ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు సీనరైజ్ నిధులు విడుదల చేయకపోవడంతో క్వారీల నిర్వహణ సాగే స్థానిక గ్రామాల్లో అభివృద్ధి బాట పట్టడం లేదు. దీంతో ఆయా గ్రామాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. పల్లెల్లో పచ్చని గుట్టలు కండ్లముందే కరిగిపోతున్నాయి. వాగులు, వంకలు నదుల్లోని ఇసుక తరలిపోతోంది. ప్రకృతి వైపరీత్యాలకు కారణమవుతున్న కొండల తొలగింపు ప్రభుత్వానికి రాయల్టి రూపంలో కోట్లాది రూపాయలు తెచ్చిపెడుతుండగా వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. గ్రామ పంచాయతీలతో పాటు మండల, జిల్లా పరిషత్‌లకు మాత్రం రాయల్టి సొమ్ము చేరడం లేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది.

జిల్లాలో ఇసుక, కంకర క్వారీలు

జిల్లా ఇసుక క్వారీలకు ప్రసిద్ధి. బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లో మంజీరా పరివాహక ప్రాంతాల్లో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఇసుక క్వారీలు ఏర్పాటు చేసి తవ్వకాలు చేపట్టాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రాంతాల్లో వాగులు, చెరువుల్లోనూ స్థానిక రెవెన్యూ ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తుంటాయి. జిల్లా పరిధిలోని ప్రధానంగా బీర్కూర్, బిచ్కుంద మండలాల పరిధిలో మంజీరా నదిలో గత ఐదేళ్ల కిందట ఇసుక రీచ్‌లకు సుమారు 24లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మరో 31 లక్షల క్యూబిక్ మీటర్లలో ఇటీవల తవ్వకాలు చేపట్టారు. ఇవేకాకుండా మాచారెడ్డి, భిక్కనూరు, తాడ్వాయి, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, నస్రూల్లాబాద్, మద్నూర్, పిట్లం తదితర మండలాల్లో కంకర, క్వార్ట్, మొరం తవ్వకాలు సైతం ఉన్నాయి. ఈ క్వారీల ద్వారా ఆయా కాంట్రాక్టర్‌లు అనుమతులు తీసుకుని ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తుం టారు.

ఎనిమిదేళ్లుగా విడుదల కాని సీనరైజ్ నిధులు

జిల్లాలోని ఇసుక, కంకర, క్వార్ట్, మొరం క్వారీల ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల్లోనే పన్ను రూపేనా సీనరైజ్ నిధులు వస్తుంటాయి. కానీ ప్రభుత్వం నుంచి గత ఎనిమిదేళ్లుగా సీనరైజ్ నిధులు మాత్రం విడుదల కావడం లేదు. 2015-16లో ఇసుక క్వారీల ద్వారా రూ.6.20 కోట్లు, కంకర, మొరం ఇతర గనుల ద్వారా రూ.12.20 లక్షలు ప్రభుత్వానికి సీనరైజ్ రూపేనా నిధులు చేరాయి. 2016-17లో ఇసుక క్వారీల ద్వారా 6.32 కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 10.50 లక్షలు, 2017-18లో ఇసుక క్వారీల ద్వారా 2.90కోట్లు కంకర, మొరం క్వారీల ద్వారా 11.47 లక్షలు, 2018-19లో ఇసుక క్వారీల ద్వారా 5.20 కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 1.60 లక్షలు, 2019-20లో ఇసుక క్వారీల ద్వారా 8.45 కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 11.34 లక్షలు, 2020-21లో ఇసుక క్వారీల ద్వారా 8.45 కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 13.53లక్షలు, 2021-22లో ఇసుక క్వారీల ద్వారా 14.32 కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 16.63 లక్షలు, 2022-23లో ఇసుక క్వారీల ద్వారా 6.12 కోట్లు, కంకర, మొరం క్వారీల ద్వారా 12.23లక్షలు ప్రభుత్వానికి సీనరైజ్ నిధులు చేరినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

స్థానిక సంస్థలకు చేరని రాయల్టీ సొమ్ము

జిల్లాలో ఇసుక, కంకర, మొరం ఇతర క్వారీల ద్వారా సీనరైజ్ రూపంలో ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నిధులు చేరుతున్నాయి. అయితే ఈ సీనరైజ్ నిధులతో ఆయా క్వారీలు నిర్వహణ జరిగే గ్రామాలకు విడుదల చేసి అభివృద్ధి చేయాల్సి ఉంటుంది.
అయితే స్థానిక సంస్థలకు మాత్రం ఈ నిధులు చేరడం లేదు. దీంతో ఏళ్లుగా రాయల్టి సొమ్ము కోసం ఎదురుచూపులే మిగులుతున్నాయి. ఖనిజ, ఇతర సహజ వనరులు ఇసుక, కంకర క్వారీలు ఏ ప్రాంతంలో ఉంటాయో వాటి వినియోగం ద్వారా వచ్చే సీనరైజ్ నిధులు ఆ ప్రాంతంలోని స్థానిక సంస్థల అభివృద్ధికి కేటాయించాల్సి ఉంటుంది. ఇందులో ఇసుక ద్వారా క్యూబిక్ మీటర్‌కు రూ.40 కంకర క్వారీలో క్యూబిక్ మీటర్‌కు రూ.75 చెల్లించాలి. ఇందులో జడ్పీకి 25 శాతం, మండల పరిషత్‌లకు 50 శాతం, గ్రామ పంచాయతీలకు 25శాతం నిధులు జమ చేయాలి. ఈ ఆదాయాన్ని గతంలో నేరుగా జడ్పీ ఖాతాలో జమచేసి వారి ద్వారా మండల, గ్రామ పంచాయతీ ఖాతాలకు బదిలీ చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వ ఖాతాకే జమ అవుతున్నాయి. ఇసుక ద్వారా వచ్చే సీనరైజ్ నిధులు 2018 నుంచి రావడం లేదని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఈ నిధులు విడుదల చేస్తే ఆయా గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.



మంజీరాలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

ఫటా..ఫట్...

జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవు

- బాన్సువాడలో తప్ప ఎక్కడా కోళ్లు చనిపోలేదు
- 70 డిగ్రీలకు పైగా ఉడకబెట్టిన చికెన్ తినవచ్చు
- 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే కోళ్లకు ప్రమాదం
- జిల్లాలో పశుగణన 83 శాతం పూర్తయ్యింది
- గాలికుంటు నివారణకు 100 శాతం పశువులకు టీకాలు వేశాం
- సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే
- జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి సంజయ్‌కుమార్



కామారెడ్డి టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం బర్డ్‌ఫ్లూకు సంబంధించిన లక్షణాలు లేవని, బాన్సువాడలో తప్ప ఎక్కడా కోళ్లు చనిపోలేదని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సంజయ్‌కుమార్ అన్నారు. బర్డ్‌ఫ్లూకు సంబంధించి ప్రజల్లో ప్రస్తుతం అనుమానం కొద్దికొద్దిగా తగ్గిపోతుందని ఒకవేళ ఎవరికైన అనుమానం ఉన్నా 70 డిగ్రీలకు పైగా ఉడకబెట్టిన చికెన్‌ను తినవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతున్నందున 40 డిగ్రీలు దాటితే కోళ్లకు ప్రమాదం ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. కాబట్టి కోళ్ల ఫాంల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పశు సంవర్ధకశాఖ పనితీరు, ఇబ్బందులు తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి'కి పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో బర్డ్‌ఫ్లూకు సంబంధించిన ఆనవాళ్లు ఏమైనా ఉన్నాయా?

అధికారి: జిల్లాలో ప్రస్తుతం బర్డ్‌ఫ్లూకు సంబంధించిన ఆనవాళ్లు ఏమీలేవు. బాన్సువాడలో తప్ప ఎక్కడా కోళ్లు చనిపోలేదు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ బర్డ్‌ఫ్లూ లాంటివి రాకుండా చూసుకుంటున్నాం. ప్రతీ మండలంలో ఉన్న పశువైద్యాధికారిని అప్రమత్తం చేస్తు పౌల్ట్రి రైతులకు తగిన అవగాహన కల్పించాలని తెలిపాం. ఒకవేళ ఎక్కడైన కోళ్లు మృత్యువాత చెందితే వెంటనే సమాచారం ఇవ్వాలని అన్ని పౌల్ట్రీల యజమానాలకు సూచించాం.

ఆంధ్రజ్యోతి: బర్డ్‌ఫ్లూపై ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి: బర్డ్‌ఫ్లూపై ప్రజల్లోనూ ప్రస్తుతం అనుమానం కొద్దికొద్దిగా తగ్గిపోతోంది. గత రెండు నెలల కంటే ప్రస్తుతం చికెన్ అమ్మకాలను చూస్తేనే తెలుస్తోంది ప్రజల్లో ఎంతమేర అవగాహన వచ్చిందనేది. ఒకవేళ ఎవరికైన ఇంకా అనుమానం ఉన్నా 70 డిగ్రీలకు పైగా ఉడకబెట్టిన చికెన్‌ను తినవచ్చు. ఇక ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతున్నందున పైల్ట్రీఫాం యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. 40 డిగ్రీల ఎండ తీవ్రత పెరిగితే కోళ్లు మృత్యువాత పడే అవకాశం ఉన్నందున కోళ్లకు ఎండవేడిమి తగులకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో పశుగణన ఎంత వరకు వచ్చింది?

అధికారి: జిల్లాలో పశుగణన 83శాతం పూర్తయింది. ప్రతీ మండలంలో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం తెల్ల పశువులు 47,430, గేదెలు 73,524, గొర్రెలు 3 లక్షల 29వేల 536, మేకలు 1లక్ష 2వేల 240, పందులు 3042, గాడిదలు 278తో పాటు ఇతర జంతువులను గుర్తిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఎంతమేర వేశారు?

అధికారి: ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ఆవులకు, ఎద్దులకు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తాం. ఇటీవల చేపట్టిన కార్యక్రమం 100 శాతం పశువులకు టీకాలు వేశాం. సీజనల్ వ్యాధులు గొంతువాపు, జబ్బువాపు రాకుండా నివారణ టీకాలు వేస్తున్నాం. ఇక గొర్రెల్లో మేకల్లో పీపీఆర్ వ్యాధి రాకుండా సంవత్సరానికి రెండు సార్లు టీకాలు వేస్తున్నాం. నీలి నాలుక వ్యాధిని నివారించేందుకు టీకాలు వేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పశు సంవర్ధకశాఖలో ఎన్ని ఆసుపత్రులు ఉన్నాయి. సిబ్బంది కొరతను ఏ విధంగా అదిగమిస్తున్నారు?

అధికారి: పశు సంవర్ధకశాఖలో మొత్తం 52 ఆసుపత్రులు ఉన్నాయి. ఇందులో బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, బిచ్కుంద, మద్నూర్, దోమకొండల్లో ఆసుపత్రులు ఉండగా 30 చోట్ల ప్రైమరీ వెటర్నరి సెంటర్‌లు, 16ఉప కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 25 మంది వైద్యులు, 36 మంది పారా వెటర్నరి సిబ్బంది పని చేస్తున్నారు. ఇక కొద్దిమేర సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. ఇద్దరు ఏడీ క్యాడర్ అధికారులు డిప్యూటేషన్‌లో ఉన్నారు. జిల్లా కార్యాలయానికి సంబంధించి సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, డ్రైవర్, ఆఫీస్ సబార్డినేట్ ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే పనులు సాగేలా చూస్తున్నాం.





- జిల్లాలో ఘనంగా హోలీ పండుగ
- చిందులేసి రంగోళి వేడుకలను జరుపుకున్న యువతి, యువకులు

కామారెడ్డి టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో శుక్రవారం హోలీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆయా వార్డుల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా డీజే సౌండ్‌ల తో, బ్యాండు మేళాలతో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఆనందోత్సాహాల మధ్య హోలీ జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆయా ప్రధాన కూడళ్లలో గులాలు, ఇతర రంగులతో కూడిన నీళ్లను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సంతోషంగా హోలీ పండుగను జరుపుకున్నారు. కోడి గుడ్లు పగులగొట్టి రంగులను ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. టీఎన్‌జీవోస్ నాయకులు హోలీ ఆడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగులు కలిసి ఉన్నట్లుగానే ఉద్యోగులు కలిసి ఉండాలని అన్నారు. ఉద్యోగులు విధులు నిర్వర్తించే సమయంలో ఒత్తిడికి గురి కాకుండా తోటి ఉద్యోగులతో స్నేహభావంతో మెలిగి తమ విధులను నిర్వహించాలన్నారు. జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో హోలీ వేడుకలను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయం తో పని చేసి జిల్లా అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగ రాజు, సహధ్యక్షుడు చక్రధర్, జిల్లా కోశాధికారి దేవరాజు, శ్రీనివాస్‌రెడ్డిపాల్గొన్నారు.



కామారెడ్డిలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



హోలీ సంబరాల్లో పాల్గొన్న టీఎన్‌జీవోస్ నాయకులు



ఎల్లారెడ్డిలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

మత్తు వదిలిస్తున్నారు

- మద్యం తాగిన వారికి జరిమానాలతో పాటు ఊచలు లెక్కపెట్టిస్తున్న పోలీసులు
- బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై ప్రత్యేక దృష్టి
- మరోవైపు అవగాహనలతో ప్రజల్లో చైతన్యం
- కొందరి పనితీరుతో మసకబారుతున్న పోలీసుశాఖ ప్రతిష్ఠ
- పలువురు కోర్టు కానిస్టేబుళ్ల చేతివాటం

కామారెడ్డి టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తు తలకు ఎక్కిన మత్తు వదిలిస్తున్నారు. బ్రీత్ అనలైజర్ టెస్ట్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తూ జరిమానాలతో పాటు జైలు శిక్ష విధించేలా చూస్తున్నారు. రహదారి ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడంలో భాగంగా ప్రత్యేక ప్రణాళికతో వెళ్తున్న పోలీసు యంత్రాంగం డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలను సమర్థవంతంగా వినియోగించుకుంటుంది. ఒక వైపు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునే మరోవైపు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేపడుతూ అందులో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై ప్రత్యేక దృష్టిసారిస్తు కట్టడికి చర్యలు చేపడుతున్నారు.

ముమ్మరంగా డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు

వాహనాల తనిఖీల సమయంలో బ్రీత్ అనలైజర్ ద్వారా డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తారు. తనిఖీల్లో పట్టుబడిన వారు గతంలో నైతే డిపార్ట్‌మెంట్‌లో తెలిసిన వారితో లేదా పలుకుబడి ఉన్న వారితో ఫోన్ చేయించి వదిలించుకునే ప్రయత్నం చేసేవారు. కానీ ప్రస్తుతం వాహనదారులకు అలాంటి అవకాశం ఇవ్వకుండా పరీక్షల్లో పట్టుబడిన వెంటనే వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్లు బ్రీత్ అనలైజర్‌లో చూపించిన ఆల్కహాల్ శాతం తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి కేసు నమోదు చేస్తున్నారు. బీఏసీ(బ్లడ్ ఆల్కహాల్ కన్సంట్రేషన్) ప్రమాణాల మేరకు ప్రతీ వంద మిల్లీ లీటర్ల రక్తంలో 30 మిల్లీ గ్రాములకు మంచి మద్యం మోతాదు మించకూడదు. బ్రీత్ అనలైజర్ పరీక్షలు 30 మిల్లీ గ్రాములు దాటిన వారిపై కేసు నమోదు చేస్తారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి మద్యం తాగిన వాహనదారులను వారి గమ్యస్థానాలకు పంపించి వేస్తున్నారు. చార్జిషీట్ నమోదు చేసి కేసును న్యాయస్థానానికి పంపిస్తున్నారు. కేసు తీవ్రతను బట్టి జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంది.



కామారెడ్డిలో డ్రంకెన్‌డ్రైవ్ చేస్తున్న పోలీసు (ఫైల్)

పలువురు కోర్టు కానిస్టేబుళ్ల చేతివాటం

ప్రజలకు ప్రమాదాల నుంచి దూరం చేసేందుకు పోలీసుశాఖ చేస్తున్న ప్రయత్నం ముమ్మాటికీ హర్షించదగిన విషయమే అయినప్పటికీ కొందరు సిబ్బంది పనితీరుతో పోలీసుశాఖ ప్రతిష్ఠ మసకబారుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కేసు నమోదు తర్వాత కోర్టుకు హాజరవ్వాలని సూచిస్తున్న పలువురు కోర్టు కానిస్టేబుళ్లు వారి చేతివాటం చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేసు తీవ్రతను బట్టి జరిమానా వందల్లో పడుతుండగా పలువురు కానిస్టేబుళ్లు వేలల్లో వసూలు చేస్తున్నారని, మరికొందరైతే మేము డబ్బులు కట్టేస్తామని చెప్పి తీసుకుని వాటిని కోర్టులో కట్టడం లేదని వాహనదారులు వాపోతున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో డ్రంకెన్‌డ్రైవ్‌కు సంబంధించి ఉన్న ఫొటోలు అలాగే ఉండడంతో ఎక్కడైన వాహనాలు పట్టుబడినప్పుడు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలతో పాటు మరీ ముఖ్యంగా కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని ఆయా పోలీసుస్టేషన్‌లలో పని చేస్తున్న సిబ్బందిపై ఇలాంటి విమర్శలు ఎక్కువగా రావడం కొసమెరుపు. జిల్లా ఉన్నతాధికారులు చేతివాటం చూపుతున్న కోర్టు కానిస్టేబుళ్ల పనితీరుపై దృష్టి సారించి పోలీసుశాఖ ప్రతిష్ఠ మసకబారకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బోధన్ పట్టణంలో పోస్టాఫీస్ వద్ద హోలీ వేడుకలు



కోటగిరిలో రంగులు చల్లుకుంటున్న యువకులు



నవీపేటలో జరిగిన హోలీ సంబరాలలో పాల్గొన్న యువకులు



హోలీ ఆడుతున్న మహిళలు

ఘనంగా హోలీ సంబరాలు

బోధన్‌రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంతో పాటు సాలూర మండలంలోని సాలూర, బోధన్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కులమతాలకు అతీతంగా చిన్నపెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ నిర్వహించారు. యువకులు, పెద్దలు తమ స్నేహితులతో కలిసి పండుగను ఉత్సహంగా నిర్వహించుకున్నారు. బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏకచక్ర సేవా సమితి ఆధ్వర్యంలో హోలీ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.



ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద రంగులు చల్లుకుంటున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌లో ..

పెర్కిట్: పట్టణంలోని మామిడిపల్లి, పెర్కిట్, ఆర్మూర్‌లోని వివిధ వార్డులలో యువకులు హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు రంగులు చల్లుకొని మిఠాయిలు తినిపించుకొని హోలీ సంబరాలు జరుపుకున్నారు. అలాగే మామిడిపల్లిలో యోగా బృందం సభ్యులు హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పెర్కిట్‌లోని విశాఖ కాలనీలో కుటుంబ సమేతంగా ఒక చేరి రంగులు చల్లుకొని ఒకరినొకరు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

కోటగిరి: మండలంలో శుక్రవారం హోలీ వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం రాత్రి పలు గ్రామాలలో కామదహన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే యువకులు, చిన్నారులు, విద్యార్థులు హోలీ సంబరాల్లో మునిగిపోయారు. పొతంగల్ మండలంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రుద్రూరు మండలంలోనూ హోలీ ఘనంగా నిర్వహించారు.



మామిడిపల్లిలో హోలీ సంబరాల్లో పాల్గొన్న యోగా బృందం సభ్యులు

రెంజల్: మండలంలోని తాడ్‌బిలోలి, కందకుర్తి, వీరన్నగుట్ట, బాగేపల్లి, కూనేపల్లి, మొగులాల్ తండా గ్రామాలలో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్దంగా గురువారం రాత్రి కామదహనం చేసి శుక్రవారం హోలీ పండుగ నిర్వహించారు. చిన్నపెద్ద తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ వేడుకలలో పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రజలు, యువకులు ఆనందోత్సవాల మధ్య హోలీ ఘనంగా జరుపుకున్నారు. యువకులు చిన్నారులు మహిళలు సైతం హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటు పరస్పర హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు పాటలపై స్టెప్పులువేస్తు హోలి వేడుకల్లో పాల్గొన్నారు. హాసాకొత్తూర్‌లో మాజీ ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, విండో వైస్ చైర్మన్ గడ్డం శ్రీధర్, రేవతి గంగాధర్, గడ్డం సంతోష్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హోలీసంబరాల్లో పాల్గొన్న కమ్మర్‌పల్లి ఎస్సై అనీల్ రెడ్డి, యువకులు

ఎడపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం కామ దహనం చేసి శుక్రవారం హోళీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. యువకులు, పిల్లలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు చోట్ల మహిళలు సైతం రంగులు చల్లుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఏర్గట్ల: మండలంలో శుక్రవారం హోలీ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువత మహిళలు తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు.

బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో..

ముప్కాల్: బాల్కొండ, ముప్కాల్ మం డలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రజలు హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి ఆయా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కామదహనం నిర్వహించారు. శుక్రవారం మండలాల్లోని అన్ని గ్రామాల్లో యువకులు, మహిళలు, చిన్నారులు, పెద్దలు అందరు కలిసి హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

భీమ్‌గల్: పట్టణంలో ప్రజలు, యువకులు, అధికారులు, నాయకులు శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ సత్యనారాయణగౌడ్ ఎస్సైన మహేష్‌కు సిబ్బంది రంగులతో హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సర్వసమాజ్ అధ్యక్షుడు నిలం రవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులందరు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణంలో యువకులు, మహిళలు, చిన్నారులు ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.



తాడ్‌బిలోలిలో హోలీ వేడుకల దృశ్యం

మెండోర: హోలీ వేడుకలు శుక్రవారం మండలంలో ఉత్సహంగా జరిగాయి. చిన్నపెద్ద తేడాలేకుండా ప్రతీఒక్కరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. యువతి, యువకులు కేరింతలు కొడుతూ రోడ్లపైకి వచ్చారు. రంగులు చల్లుకోవడంతో పాటు ఆటపాటలతో ఉత్సహంగా గడిపారు. రంగులతో బుక్క గులాలు చల్లుకున్నారు. మెండోర పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నారాయణ, పోలీస్ సిబ్బంది అల్లర్లు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.



ఆర్గుల్‌లో హోలీ ఆడుతున్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం హోలీ పండగను సంతోషంగా జరుపుకున్నారు. మోర్తాడ్‌లో చిన్నారులు, పెద్దలు, మహిళలు, యువకులు రంగులు చల్లుకున్నారు. హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మండలంలోని గ్రామాలలో పెద్దలు, చిన్నారులు, యువతి, యువకులు యువకులు ఒకరినోకరు రంగులు చల్లుకొని ఘనంగా హోలీ వేడుకలను జరుపుకున్నారు.



ఏర్గట్లలో హోలీ పండుగను జరుపుకుంటున్న చిన్నారులు

ప్రశ్నించే గొంతులను నొక్కేస్తారా!?

● జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



నందిపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

నందిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నించే గొంతులను నొక్కేస్తారా అని నిజామాబాద్ జిల్లా పరిషత్ మాజీచైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం అసెంబ్లీలో మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, అమలు కాని పథకాల గురించి ప్రశ్నించినందుకు మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. దీనికి నిరసనగా నందిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదుట రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతీ ఒక్కరికి ప్రశ్నించే హక్కు ఉంటుందన్నారు. జగదీశ్వర్‌రెడ్డిపై వి ధించిన సస్పెండ్ కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశా రు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, కోమన్‌పల్లి రాజన్న, అయిలాపూర్ మోహన్, బాలగంగాధర్, సతీష్, తాటికాయల సాగర్, బాష, తదితరులు ఉన్నారు.

మామిడిపల్లిలో..

ఆర్మూర్‌రూరల్: మామిడి పల్లిలో బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ప్ర భుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీలో సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రశ్నించే నాయకులను అణిచి వేయడం సరైందికాదన్నారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపితే కాంగ్రెస్ నాయకులు సహించడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు పూజ నరేందర్, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుక్కి సుధాకర్, మండల యువజన అధ్యక్షుడు అగ్గుక్రాంతి, సీనియర్ నా యకులు నచ్చు చిన్నారెడ్డి, అల్లూరి గంగారెడ్డి, విజయ్, మోహన్, సత్యానంద్, శేఖర్, హర్షద్, సైఫ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

కమ్మర్‌పల్లి: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ ను రాష్ట్ర అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రపార్టీ పిలుపు మేరకు శుక్రవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో జాతీయ రహదారిపై మండల బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రెవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బద్దం చిన్నారెడ్డి, కుంట ప్రతాప్ రెడ్డి, ప్రకాశ్ నాయక్, బద్రి, పలు గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.50వేల ఎల్‌వోసీ అందజేత

ముప్కాల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అహ్మద్ కాలుకు ఇన్ఫెక్షన్ సోకి సర్జరీ అవసరం ఉండడంతో స్థానిక ప్రజాప్రతినిదులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో కాలు ఆపరేషన్ కోసం రూ.50వేల ఎల్‌వోసీ మంజూరు చేసిన ఎల్‌వోసీ కాపీని సంబంధిత కుటుంబసభ్యులకు శుక్రవారం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కమ్మర్‌పల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసాకొత్తూర్ మారుతి నగర్ కాలనిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై అనీల్ రెడ్డి తెలపారు. వారివద్ద నుంచి 5 వేల 230 రూపాయల నగదు నాలుగు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కసునమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



మెండోరలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



బాల్కొండలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కమ్మర్‌పల్లి, మార్చ్ 14(ఆంధ్రజ్యోతి) మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ కమ్మర్‌పల్లి మండల పార్టీ కార్యాలయంలో మండల నాయకులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బద్దం చిన్నారెడ్డి, కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుంట ప్రతాప్ రెడ్డి, ప్రకాశ్ నాయక్, మండల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు నాయకులు బద్రి, ఏనుగు రాజేశ్వర్, గంగారెడ్డి, అవారి మురళి, సదాశివ్ గౌడ్, బద్దం రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏర్గట్ల: ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదినాన్ని శుక్రవారం బీ ఆర్ ఎస్ నాయకులు పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబురాలు జరి పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, భారస మండలాధ్యక్షుడు పూర్ణానందం, మాజీ ఎంపీటీసి జక్కని మధు, బద్ధం శ్రీనివాస్ రెడ్డి, క్యాతం సుభాష్, నాగిరెడ్డి రాజేందర్, బద్దం ప్రభాకర్, బద్ధం హన్మాండ్లు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెండోర: మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మచ్చర్ల రాజారెడ్డి, సామ గంగారెడ్డి, గోపిడి గంగారెడ్డి, నవీన్‌గౌడ్, ఏలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..

ముప్కాల్: బాల్కొండ మండల కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుక లను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అలాగే ముప్కాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వీట్లు ఒకరినోకరు పంచుకున్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా. బీఆర్ఎస్ నా యకులు రక్తదానం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ, ముప్కాల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్, బద్దం ప్రవీన్‌రెడ్డి, దాసరి వెంకట్‌రెడ్డి, నాగభూషన్, సురాజ్‌రెడ్డి, సాగర్‌యాదవ్, రఘునాథ్, శ్రీనివాస్ గౌడ్, మహేష్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదినాన్ని మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, మాజీజడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, నాయకులు భగత్, మూత లింబాద్రి, సతీష్‌గౌడ్, బోదిరె నర్సయ్య, శర్మనాయక్, సుర్జిల్, రెహమన్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో..

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన పురస్కరించుకొని మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, బీఆర్ఎస్ నాయకులు పసుల నితిష్, పోతుగంటి నిశాంత్, కొమ్ము నరేష్, శోభన్, సాయికుమార్, రాముగౌడ్‌లు హైదరాబాద్ వెళ్లి ఎమ్మెల్యే నివాసంలో ప్రశాంత్‌రెడ్డికి జన్మదిన,హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి ఒకరినోకరు పంచు కున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మాజీసర్పంచ్ బోగ ఆనంద్, సొసైటీ చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గడ్డం చిన్నారెడ్డి, మాజీజడ్పీటీసీ బద్దం రవి, బీఆర్ఎస్ నాయ కులు తీగెల సందీప్, గడ్డం మల్లేష్, వెల్మ రవీంధర్‌రెడ్డి, గంగారెడ్డి, ఎంపీపీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఏలియా, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ దేవాలయాలు బౌద్ధులకే చెందాలి

మోర్తాడ్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బుద్దగాయ పుణ్యక్షేత్రమైన మహాబోధి మహా వీర విహార్‌ను బ్రహ్మణులకు బౌద్దులే సభ్యులుగా ఉండాలని ఆల్ ఇండియా బుద్ద సొసైటీ ఉపాధ్యక్షుడు పత్తే సత్యబోధి ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ద గయాలో బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని నిరసిస్తూ ఆల్‌ఇండియా బుద్ద ఫోరం కమిటీ ఆధ్వర్యంలో గత ఫిబ్రవరి 12నుంచి మహాధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులుగా వచ్చి బోదివృక్ష వద్ద తపస్సు చేసి సంపూర్ణ జ్ఞానోదయం చేట బోదివృక్ష బౌద్దులకు ఎంతో పుణ్య ప్రదేశామని పేర్కొన్నారు. బుద్దగాయ దేవాలయం 1949 చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చి బుద్దుని మందిరంలో తొమ్మిది మంది సభ్యులలో ఐదుగురు బ్రాహ్మణులను నియమిస్తూ కేవలం నలుగురు బౌద్దులను నియమించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీటీ, 1949చట్టాన్ని రద్దు చేస్తూ బౌద్ధ దేవాలయాలు బౌద్ధులకే చెందాలని గత 32రోజులుగా మహాధర్నా పాల్గొంటున్నామన్నారు. పాలెం గ్రామ నివాసి బౌద్ధి బిక్షువు వట్టే సత్య మూర్తి మాట్లాడుతూ గ్రామ గ్రామాన నిరసనలు తెలపాలన్నారు.



బుద్దగాయలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న బౌద్ధ భిక్షువులు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



తొర్లికొండ ఆలయంలో ఊంజల సేవలో పాల్గొన్న భక్తులు

జక్రాన్‌పల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ఊంజల సేవ నిర్వహించారు. ఈ ఊంజాల సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు

మోస్రా, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారంతో 4వ రోజుకు చేరుకున్నాయి. ఎస్సీ కుల వర్గీకరణ బిల్లు ఆమోదం తెలిపే వరకు దీక్షను విరమించబోమని జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ జనాభా నిష్పత్తి ప్రకారం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ దీక్ష కొనసాగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సాయిలు, గంగారాం, దొండ శ్రీనివాస్, గణపురం భూమయ్య, పాండు, పెంట నందు నాని, గణపురం పొట్టి గంగారాం, గంగాధర్ పాల్గొన్నారు.

20 ట్రిప్పుల ఇసుక డంప్ సీజ్

నందిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్వేద గ్రా మంలో అకరమంగా నిల్వ ఉంచిన 20ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంప్‌ను శుక్రవారం ఎస్సై ఎం.చిరంజీవి సీజ్ చేశారు. నవీపేట మండలం నాలేశ్వర్, నందిపేట మండలం తల్వేద గ్రామాల మధ్య ఉన్న వాగు నుంచి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా 20ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. అంతేగాకుండా స్థానిక వీఆర్ఏ, కారోబార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా అక్రమంగా తరలించిన డంప్ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాక్టర్ యాజమానులు డ్రైవర్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అంతేగాకుండా పెద్దమొత్తంలో జరిమానాలు విధిస్తామని ఎస్సై ఎం.చిరంజీవి హెచ్చరించారు.

వాగులో పడి వ్యక్తి మృతి



మృతుడు గోపు భోజన్న

మాక్లూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజిలి గ్రామానికి చెందిన గోపు భోజన్న (50) అనే వ్యక్తి వాగులో పడి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడు శుక్రవారం పంట పొలాలకు పైపులు పిట్టింగ్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు వాగులో పడి చనిపోయినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధం



ప్రమాదంలో కాలిబూడిదైన నగదు, సామగ్రి

కోటగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన లక్ష్మి, సావిత్రిలకు చెందిన ఇళ్లు ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తి కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఇళ్లలో ఉన్న బంగారం, వెండి, నగదు, నిత్యావసర సరుకులు పూర్తిగా కాలిపోయి నిరాశ్రయులుగా మిగిలారు. సుమారు మూడు లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఫైర్ స్టేషన్ అధికారులు సకాలంలో చేరుకుని మంటలను ఆర్పడంతో ప్రమాదం తప్పింది. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

పెర్కిట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంధ పాఠశాలలో 21వ వార్షికోత్సవ సంబరాలు ఘ నంగా నిర్వహించారు. మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి, మండల విద్యాధికారి రాజగంగారాం, ఈ అభ్యాస్ అకాడమి వ్యవ స్థాపకులు డాక్టర్ భువనగిరి, ఫణి పవన్‌శాస్త్రీలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి గొప్ప వ్యక్తుల జీవితాలను ప్రేరణగా ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాం క్షించారు. జబర్దస్త్ నటులు నూక రాజు, ఇమాన్యూయేల్, సీరియల్ నటి చామంతి, ప్రత్యూషలు వేడుకల్లో పాల్గొని అలరించారు. వార్షికోత్సవ సంబరాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని వార్షికోత్సవాన్ని విజయవంతం చేసినందుకు యాజమాన్యం ప్రసాద్, సాగర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మార్క్స్ స్ఫూర్తితో ఉద్యమిస్తాం

ఆర్మూర్‌రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బానిస సంకెళ్ల నుంచి కార్మిక శ్రమను దోచుకుంటున్న పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను చైతన్యవంతం చేసి మార్క్స్ స్ఫూర్తితో రానున్న రోజుల్లో ఉద్యమిస్తామని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లెపు వెంకటేష్, సీపీఐ ఎంఎల్ డివిజన్ కార్యదర్శి దాసు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కార్ల్ మార్క్స్ వర్థంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ నాయకులు దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టి మతోన్మాధాన్ని రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధిపొందుతున్నారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, సాయిలు, నవీన్, రవి, కుల్‌దీప్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సవాల మధ్య హోలీ

హోలీ జోష్

- హోలీరా.. హోలీ చమ్మకేళి అంటూ వేడుక • రంగులమయంగా మారిన జిల్లాలోని వీధులు
- సంబరాల్లో యువతీ, యువకులు • వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



కాకతీయ బాయ్స్ హాస్టల్ వద్ద హోలీ సంబరాలు



హోలీ గన్.. వేసేయ్ రంగ్..

ఆకాశం వైపు రంగులు వదులుతూ..

నిజామాబాద్ కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీరా హోలీ చమ్మకేళీ అంటూ ఆనందోత్సవాల మధ్య హోలీ పండుగను జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. హోలీ పండుగలో చిన్న, పెద్ద తారతమ్యాలు లేకుండా వేడుకల్లో పాల్గొని పండుగను జరుపుకున్నారు. ఉదయం నుంచే వీధుల్లో యువతీ,యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ శుభకాంక్షలు తెలుపుకున్నారు. పలు ప్రాంతాల్లో హోలీ పండుగను పురస్కరించుకుని సహజసిద్ధమైన రంగులను ఉపయోగించి వేడుక జరుపుకోగా మరికొన్ని ప్రాంతాల్లో పుష్పాలను జల్లుకుంటూ వేడుకలను చేసుకున్నారు. యువకులు బైకులపై తిరుగుతూ దారిన పోయేవారికి ఆత్మీయంగా పలుకరించుకుంటూ రంగులు చల్లారు. హోలీ వేడుకల్లో ప్రజాప్రతినిదులు, అధికారులు పాల్గొని ఉత్సహపరిచారు. పలు సంస్థలు బ్యాండు వాయిద్యాలతో వీధుల్లో తిరుగుతూ హోలీని జరుపుకోగా విద్యార్థులు యువతీ, యువకులు పాఠశాలల్లో, కళాశాల్లో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు.

• రంగులమయంగా మారిన వీధులు

హోలీ పండుగను పురస్కరించుకుని వివిధ రంగులు ఒకరిపై ఒకరు చల్లుకోవడంతో వీధులన్నీ రంగులమయంగా మారాయి. చిన్నారులు మొదలుకొని పెద్దవారు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని ఒకరిపై ఒకరు రంగుల నీళ్ల చల్లుకుని పండుగను జరుపుకున్నారు. గ్రామాలు మొదలుకొని మండల, పట్టణాలు వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పండుగ జరుపుకోవడంతో హోలీ సంబరాలతో మిన్నంటాయి. అపార్ట్‌మెంటులు, గ్రేటర్ కమ్యూనిటీ, అభివృద్ధి కాలనీల కమిటీ, స్వచ్ఛంధ సంస్థలు, లేడీస్, బాయ్స్ హాస్టళ్లలో హోలీ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుని వేడుకలు జరుపుకున్నారు.

బీజేపీ కార్యాలయంలో అంబరాన్నంటిన సంబరాలు

జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యలయంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగాసాగాయి. వేడుకల్లో భాగంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగను జరుపుకున్నారు. హోలీ వేడుకలకు ముఖ్యఅథితిగా హాజరయిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణ నాయకులపై, కార్యకర్తలపై రంగులుచల్లి శుభకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బ్యాండ్ వాయిస్తూ కార్యకర్తల్లో జోష్ నింపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతీ కార్యకర్తలను ఆత్మీయంగా పలుకరించి తీపిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందు సంప్రదాయంలో ప్రతి పండుగ శాస్త్రీయత కూడి ఉంటుందని అన్నారు. హోలిక అనే రాక్షసి అంతమోందించి చేసుకునే గొప్ప వేడుక హోలీపండుగ అని అన్నారు. వసంత రుతువుకు నాందిగా పండుగలో రుతు సంబంధమైన వ్యాధులు ప్రభల కుండా పండుగలో సహజసిద్ధమైన ఔషధ గుణాలున్న రంగులతోనే వేడుక జరుపుకుంటారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హోలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్



నగరంలో రంగులు పూసుకుంటున్న మహిళలు

నృత్యాలు చేస్తూ..



గోశాల వద్ద భజన కార్యక్రమంలో కళాకారులు



కాకతీయ కళాశాల వద్ద యువతుల కేరింతలు




సాయినగర్‌లో రంగులు ఆడుతున్న చిన్నారులు



ఏబీవీపీ ఆధ్వర్యంలో..

పంటలకు నీరివ్వండి!

- సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతు ఆవేదన • సోషల్ మీడియాలో సెల్ఫీవీడియో వైరల్



ఎండిపోయిన లింగాపూర్ శివారులోని వాగు

నవీపేట, మార్చి14 (ఆంధ్రజ్యోతి): సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని మండలంలోని లింగాపూర్‌కు చెందిన కోరే నారాయణ అనే రైతు తీసిన సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లింగాపూర్ ఎగువన చేపట్టిన శాఖాపూర్ ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగిలో సాగు నీటిని విడుదల చేయడంతో దిగువన ఉన్న లింగాపూర్, నిజాంపూర్ శివారులతోపాటు మాక్లూర్ మండలం గుంజిలి ప్రాంతంలో పొట్టదశలో ఉన్న వరిపంట ఎండిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినవారు పట్టించుకోవడం లేదని తన సెల్ఫీవీడియోలో ఆరోపించాడు. ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వందలాది ఎకరాల వరి పంటను కాపాడడానికి ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తగిన చొరవ చూపాలని ఆయన తన సెల్ఫీ వీడియోలో వేడుకున్నాడు.



లింగాపూర్ వాగులో మోటార్లకు అందని నీరు



బెల్టు షాపులో మద్యం పట్టుకున్న పోలీసులు(ఫైల్)

పేరుకే బంద్..

ఫుల్లుగా మందు!

- హోలీ పండుగవేళ మద్యం షాపుల మద్యం జోరు • బెల్టు షాపులలో ఫుల్‌స్టాక్
- విచ్చలవిడిగా విక్రయాలు • పట్టించుకోని ఎక్సైజ్ శాఖాధికారులు

బోధన్ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ నేపథ్యంలో గురువారం సాయంత్రం 6గంటలకే ఎక్సైజ్ అధికారులు వైన్స్ బార్ అండ్ రెస్టారెంట్‌లకు తాళాలు వేసి సీజ్ చేశారు. గురు, శుక్రవారాలు బంద్ ఉన్న నేపథ్యంలో అబ్కారీ అధికారులు వైన్స్ షాపులు సీజ్ చేయడానికి ముందే వైన్స్‌షాపుల్లోని సరుకు అంతా బెల్టుషాపుల్లోకి తరలించి నిల చేసినట్లు తెలుస్తోంది. వైన్స్‌షాప్‌లో మందు రేటు కంటే బెల్టు షాపు నిర్వాహకులు అధిక రేట్లకు మద్యం ప్రియులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలను నియంత్రించాల్సిన అబ్కారీ శాఖ, పోలీసులు చోద్యం చూస్తున్నారు.

• దాడులను విస్మరించిన అబ్కారీ శాఖ

మద్యం షాపులు బంద్ ఉన్న ప్రతీసారి బెల్టు షాపులన్నీ మద్యం ప్రియులతో కళకళలాడుతున్నాయి. బోధన్ పట్టణంతో పాటు మండలం, బోధన్ డివిజన్‌లోని పలు మండలాలు, గ్రామాల్లో బెల్టు షాపులలో జోరుగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. బెల్టు షాపుల నిర్వహణపై ప్రభుత్వం సిరియస్‌గా ఉన్నా అబ్కారీ శాఖ మాత్రం ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ బెల్టు షాపులు, వైన్స్ షాపుల నిర్వాహకులను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా బెల్టు షాపులు నిర్వహించడంతో ప్రజలు పండుగ వేళ అధిక ధరలకు విక్రయించి మద్యం కొనుగోలు చేయాల్సి వస్తుంది. మద్యం షాపులు బంద్ ఉంటాయన్న సమాచారం ముందుగా



తెలుసుకున్న బెల్టుషాపు నిర్వాహకులు రెండు రోజులకు సరిపడా అంతకంటే ఎక్కువ మందును తీసుకుని రహస్య ప్రదేశంలో ఉంచుతున్నారు. మద్యంప్రియులు రాగానే క్వాటరుకు రూ. 50 పైనే, బీరుకు రూ.200 పైనే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ముందుగానే డంప్ చేస్తున్న మందును పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు తెలియకుండా విక్రయాలు జరుపుతున్నాయి. అధికారుల అండదండలతోనే మద్యం విక్రయిస్తున్నారే ఆరోపణలు ఉన్నాయి.

భక్తి



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్తర తిరుపతి క్షేత్రంలో వైభవంగా బ్రహ్మోత్సవం

నిజామాబాద్‌కల్చరల్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): వేదపండితుల వేదమంత్రోచ్చరణలతో ఉత్తర తిరుపతిక్షేత్ర వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై దేవతా మూర్తులను ఉంచి అభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపారు. స్థాపితా దేవతలు, శ్రీసూక్తం, పురుష సూక్తం వేదమంత్రాలతో హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ మాడ వీధులగుండా ఉత్సవ మూర్తులను ఊరేగించి భజనలు, భక్తిపాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సంపత్‌కుమార్, తదితర భక్తులు పాల్గొన్నారు.

• నేడు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 10గంటలకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉంచి కళ్యాణ వేడుకలను జరుపనున్నారు. వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో నిర్వహించనున్నారు. కల్యాణం అనంతరం పెద్దఎత్తున అన్నప్రసాదం ఏర్పాటు చేయనున్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

బోధన్ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాతోపాటు ఇతర ప్రాంతాలలోని కిరాణషాపుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిని పట్టుకుని వారివద్ద నుంచి 50 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. వారిపై కేసునమోదు చేశామన్నారు. మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైన్స్‌లు బంద్ ఉన్న సమయంలో కిరాణషాపుల్లో, ఇతర స్థావరాలలో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జర దేఖో!!

ఇరుకు వంతెనలతో ఇక్కట్లు!

- అవస్థలు పడుతున్న రైతులు, వాహనదారులు • పట్టించుకోని అధికారులు

కమ్మర్‌పల్లి, మార్చి 14: (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్లూర్ గ్రామ శివారుల్లో ఏర్గట్ల వైపు వెళ్లే ప్రధాన రహదారిలో శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ, రాజరాజేశ్వరనగర్ (ఆర్‌ఆర్‌నగర్) గ్రామ సమీపంలోని వంతెనలు ఇరుకుగా ఉండి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఈ రహదారి గుండా ఏర్గట్ల, తాళ్లరాంపూర్‌తో పాటు ఆదిలాబాద్ జిల్లా నిర్మల్, ఖానాపూర్, కరీంనగర్ జిల్లా ఇబ్రహింపట్నం, మెట్‌పల్లి తదితర గ్రామాలకు రోజువారి ప్రయాణాలు సాగిస్తారు కాగా, ప్రతీ శుక్రవారం పవిత్ర పుణ్యక్షేత్రాలు తడ్‌పాకల్, దోంచందా, గుమ్మిర్యాల్, ఎర్దండి గంగస్నానాలకు భక్తులు రాకపోకలు సాగిస్తారు. కాకతీయ కాలువపై బ్రిడ్జీ ఇరుకుగా ఉండడంతో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అదే రహదారిలో ఆర్‌ఆర్‌నగర్ గ్రామ సమీపంలో స్థానిక హనుమాన్ ఆలయ వద్ద బ్రిడ్జీ ఇరుకుగా ఉండి ప్రమాదకరమైన మలుపు ఉండడతంతో తరచూ ప్రమాదాలు జరుగున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి రెండు బ్రిడ్జీలను వెడల్పు చేయాలని స్థానికులు, వాహనాదారులు కోరుతున్నారు.



ఆర్‌ఆర్‌నగర్ గ్రామ శివారుల్లో ఇరుకుగా ఉండి ప్రమాదాలకు కారణమవుతున్న బ్రిడ్జి



ఉప్లూర్ కాకతీయ కాలువపై ఇరుకుగా ఉన్న బ్రిడ్జి



ఇరుకు బ్రిడ్జిలు ప్రమాదకరంగా ఉన్నాయి..

• తిప్పిరెడ్డి శ్రీనివాస్ (ఉప్లూర్)

ఉప్లూర్ గ్రామ శివారులోని కాకతీయ కాలువ బ్రిడ్జి ఇరుకుగా ఉన్నాయి. ఈ ప్రాంత వ్యవసాయ రైతులు, తోటలున్న రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రాత్రి సమయాల్లో తోటల్లోకి వెళ్లి రైతులు ఈ ఇరుకు బ్రిడ్జి వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని భయపడాల్సి వస్తోంది. సంబంధిత శాఖ అధికారులు బ్రిడ్జిలను వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉంది.

రెండు బ్రిడ్జిలు లను వెడల్పు చేయించాలి

• చింతకుంట శ్రీనివాస్ (రైతు, ఉప్లూర్)

శ్రీరాంసాగర్ కాకాతీయ కాలువ బ్రిడ్జితోపాటు ఆర్‌ఆర్‌నగర్ వద్ద గల బ్రిడ్జీని అధికారులు ప్రత్యేక శ్రద్ధవహించి వెడల్పు చేయాలి. గతంలో కాకతీయుల కాలంలో అప్పటి అవసరాల మేరకు బ్రిడ్జీలను అలా నిర్మించారు. ప్రస్తుతం పరిస్థితులు మారడంతో ఈ బ్రిడ్జిలు ఇరుకుగా మారి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. అధికారులు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి రెండు బ్రిడ్జీలనూ వెడల్పు చేయాలి.



నేటి నుంచి ఒంటిపూట బడి

మద్నూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వేసవి ప్రారంభంలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈనెల 15 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉదయం మాత్రమే తరగతులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో రాములు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే తరగతులను నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు 12.30 గంటలకే అందించాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. పదవ తరగతి పరీక్షలను ఏర్పాటు చేసిన పాఠశాలల్లో పరీక్ష నిర్వహించిన తరువాత మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని ఉత్తర్వులు వచ్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేశామని వెల్లడించారు.

ఒంటిపూట బడులను సక్రమంగా వినియోగించుకోవాలి

● రామారెడ్డి ఎంఈవో నిట్టూరి ఆనంద్‌రావు

రామారెడ్డి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమవుతాయని రామారెడ్డి ఎంఈవో నిట్టూరి ఆనంద్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమవుతాయని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతిలో 12.30 నిమిషాలకు మధ్యాహ్నం భోజనం తదితర విధంగా కార్యక్రమాల ఉంటాయని ఆయన తెలిపారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 కస్తూర్బా గాంధీ గురుకుల హాస్టల్ పాఠశాల-1 ఉప్పల్ బై రెసిడెన్షియల్ హాస్టల్-1యూపీఎస్ పాఠశాల-1, ప్రైమరీ పాఠశాలలు 30 ఉంటాయని ఆయన వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సమయ పాలన పాటించి విద్యార్థిని విద్యార్థులకు విద్యను సక్రమంగా నేర్పించే బాధ్యత ఉందన్నారు.

జుక్కల్ అవెన్యూ ప్లాంటేషన్‌లో ఎండుతున్న మొక్కలు

జుక్కల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల కేంద్రానికి సమీపంలో గతంలో ఏర్పాటుచేసిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు ఎండిపోతున్నాయి. పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణ లోపంతో సిబ్బంది మొక్కలకు నీరు పోయకపోవడంతో పూర్తిగా ఎండిపోతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి మొక్కలు ఎండి పోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మొక్కలు ఎండిన దృశ్యం

సాయిబాబా ఆలయంలో అన్నదానం

రాజంపేట,మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల పౌర్ణమిరోజున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అర్చన,అభిషేకం,పల్లకిసేవ కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

మాచారెడ్డి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లంపేట గ్రామంలో శుక్రవారం అక్రమ మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులు అనుమతులు లేకుండా అక్రమం మద్యం అమ్మడంతో వారి దుకాణాలపై దాడులు చేసి అక్రమంగా నిలువ ఉంచిన మద్యం బాటిళ్లను పట్టుకుని కేసు నమోదుచేయడం జరిగిందని తెలిపారు. మద్యం విలువ రూ.9 వేల వరకు ఉంటుందని తెలిపారు.



ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

మాచారెడ్డి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆరెపల్లి వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని, అదే విధంగా బండరామేశ్వర్‌పల్లి వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసులు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

గూగుల్ మ్యాప్‌ను నమ్ముకుంటే ప్రమాదంలోకి నెట్టింది

● బాసరకు వెళ్తుండగా కాలువలోకి దూసుకెళ్లిన కారు

● భిక్కనూరులో ఘటన

భిక్కనూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గూగుల్ మ్యాప్‌ను పెట్టుకుని బాసర సరస్వతి ఆలయానికి వెళ్తుండగా కాలువలోకి దూసుకెళ్లిన ఘటన భిక్కనూరు మండలకేంద్రంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు చెందిన కుటుంబం బాసరలోని సరస్వతి అమ్మవారి ఆలయంలో వారి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడానికి వారి మారుతీ ఆల్టో కారులో గూగుల్ మ్యాప్ పెట్టుకుని బయలుదేరారు. భిక్కనూరు సమీపానికి రాగానే భిక్కనూరు బైపాస్ గుండా కాకుండా భిక్కనూరు గ్రామం మీదుగా తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచి అంతంపల్లి వెళ్లె రోడ్డును గూగుల్‌మ్యాప్‌లో చూపించడంతో అదేదారి గుండా వెళ్తూ భిక్కనూరు శివారులో ఉన్న కాలువలోకి కారు దూసుకెళ్లింది. ఆ కాలువలో ర్యాగడి మట్టిలో కారు ఇరుక్కుని అక్కడే ఆగిపోవడంతో ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. దింతో వారు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అక్కడికి చేరుకుని జేసీబీ సహాయంతో కారును బయటకు తీసి వారి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పోలీసులు వారికి సరైనా దారిని చూపించి బాసరకు పంపించారు.



కారు కాల్వలోకి దూసుకెళ్లిన దృశ్యం

హోలీ.. ఆనందాల కేళి



బాన్సువాడలో పట్టణంలోని రిపుల్స్ పాఠశాలలో హోలీ సంబరాలు



మద్నూర్‌లో హోలీ సంబరాల్లో ఉద్యోగులు



భిక్కనూరు మండలంలోని హోలీ సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడ టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణ ప్రజలు శుక్రవారం హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి కాలనీల్లో భాజా భజంత్రీలతో ఇంటింటికీ తిరుగుతూ చిన్న, పెద్ద అందరికీ రంగులు పూస్తూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు తమతమ మిత్రులతో కలిసి సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. రిపుల్స్ పాఠశాలలో విద్యార్థులు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ ఆనందడోలికల్లో తేలిపోయారు. బోర్లం గ్రామంలో యువకులు కేరింతలతో హోరెత్తించారు. తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు హోలీ సంబరాలను జరుపుకుంటూ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పండుగ సంబరాలను జరుపుకున్నారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలో రెండు రోజుల హోలీ సంబరాలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న మద్నూర్, డోంగ్లీ మండలాల్లో రెండు రోజుల పాటు హోలీ వేడుకలు జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. హోలీ పండుగలకు ఆయా గ్రామాలకు వెళ్లిన వారు తిరిగి తమ స్వగ్రామాలకు చేరుకుని హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. హోలీ వేడుకల్లో భాగంగా మొదటి రోజున గురువారం స్వీట్లు చేసుకున్నారు. అర్ధరాత్రి కామదహనం, భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కామ దహనానికి మహిళలు నీళ్ల బిందెలతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండవ రోజు శుక్రవారం నాన్ వెజ్‌తో హోలీ పండుగ చేసుకున్నారు. వివిధ రకాల రంగులతో మహిళలు, పిల్లలు, ఉద్యోగులు రంగులు పూసుకుని ఆనందోత్సాహాలతో కేరింతలు చేశారు. సాయంత్రం వరకు రంగులు ఆడుతూ ఆనందోత్సాహాలతో రెండు రోజుల హోలీ పండుగ ముగిసింది.

నసురుల్లాబాద్: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రంలో శుక్రవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. హోలీ పండుగను పురస్కరించుకుని గ్రామస్తులు, యువకులు, చిన్నారులు ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బీర్కూర్: మండల వ్యాప్తంగా ప్రజలు హోలీ పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. బీర్కూర్, బరంగేడ్డి, బైరాపూర్, సంబాపూర్, మల్లాపూర్, తిమ్మాపూర్, బీర్కూర్ తండా, కిష్టాపూర్, చించోల్లి, అన్నారం, రైతునగర్, దామరంచ, వీరాపూర్ గ్రామాల్లో యువకులు, విద్యార్థులు, చిన్నారులు, పెద్దలు అందరూ కలిసి హోలీ పండుగ సంబరాలను జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్వీట్లను పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా హోలీ పండుగ సందర్భంగా బీర్కూర్‌లో 50 కిలోల గుండురాయి ఎత్తడానికి యువకులు ఉత్సాహం చూపించారు. ప్రతీయేటా హోలీ పండుగ సందర్భంగా 50 కిలోల గుండ్రాయిని ఎత్తడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు.

దోమకొండ: మండల కేంద్రంతో పాటు గొట్టిముక్కుల, సంగమేశ్వర్, అంచనూర్, ముత్యంపేట్, సీతారాంపల్లి, అంబార్‌పేట, చింతమాన్‌పల్లి, లింగుపల్లి గ్రామాల్లో శుక్రవారం హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు, మహిళలు ఒకరికొకరు రంగులు చల్లుకుని సంబరాలు చేశారు.

బిచ్కుంద: మండలంలోని ఆయా గ్రామాలలో హోలీ సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం రాత్రి కామదహనం చేసి సంబరాలను ప్రారంభించారు. శుక్రవారం రాజకీయనాయకులు, ప్రజలు రంగులు చల్లుకుంటూ చిన్నపెద్ద తేడా లేకుండా వేడుకలలో పాల్గొన్నారు.

జుక్కల్: మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం హోలీసంబరాలు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి కామదహనం నిర్వహించి శుక్రవారం హోలీ సంబరాలు నిర్వహించారు. నిరుపేద ప్రజలు ఇంటింటికి భాజభజంత్రిలతో డబ్బు రూపంలో ఇనాములు స్వీకరించారు. హోలీ పండుగకు కొబ్బరి చక్కెరపేర్లు ఆడపడచులకు బహుమానంగా అందించారు. స్నేహభావంతో ఒకరిపై మరోకరు రంగులు చల్లుకొని సంబరాలు జరుపుకున్నారు.

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలో శుక్రవారం హోలీ పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్న పిల్లలు, యువతి, యువకులు, మహిళలు హోలీ వేడుకల్లో పాల్గొని రంగులు చల్లుకుంటూ పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఒకరినోకరు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని అన్నిగ్రామాల్లో శుక్రవారం హోళి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే యువతీ, యువకులు రోడ్లపైకి చేరుకుని ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటు కేరింతలు కొడుతూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో యువకులు డీజే సౌండ్స్ మధ్య నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

రామారెడ్డి మండలంలో వైభవంగా హోలీ పండుగ వేడుకలు

రామారెడ్డి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని రంగులు కలిసి ఉంటే అందం అందరూ కలిసి ఉంటేనే జీవితానికి ఆనందం అంటూ కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలకేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నరేష్, రాజకీయ నాయకులు, పెద్దలు, యువకులు, చిన్నారులు శుక్రవారం హోలీ పండుగ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. రెడ్డిపేట్, పోసానిపేట్, మద్దికుంట, అన్నారం, గొల్లపల్లి, ఇస్సన్నపల్లి, కన్నాపూర్, గిద్ద, ఉప్పల్వాయి, మోషంపూర్, గోకుల్ తండా, స్కూల్ తండా, రమణ తండా, కన్నాపూర్ తండా అన్ని గ్రామాల్లో, తండాల్లో తెలంగాణ పద్ధతుల ప్రకారం రాజకీయ నాయకులు, యువజన సంఘాలు, నేతలు, యువకులు, విద్యార్థులు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలోని ప్రధాన వీధులలో గురువారం రాత్రి కామ దహనం చేసి శనివారం ఉదయం చిన్నారులు, యువకులు, మహిళలు ఆనందోత్సాహాలతో హోలీ పండుగ సందర్భంగా రంగులు ఒకరినొకరు వేద జల్లుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మధ్యాహ్నం వరకే హోలీ పండుగ జరుపుకోవాలని నిబంధన మేరకు ఎల్లారెడ్డిలో ప్రశాంతంగా హోలీ పండుగ జరుపుకున్నారు. వైన్స్ దుకాణాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్సైజ్ అధికారులు మూసి వేయించారు. సాయంత్రం 6 గంటలకు తిరిగి మద్యం దుకాణాలు తెరిచారు.

● ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో...

హోలీ పండుగ సందర్భంగా ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయం వద్ద డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ నాయక్, స్థానిక ఎస్సైజ్ బొజ్జ మహేష్‌తో పాటు కానిస్టేబుళ్ళు, హోంగార్డులతో కలిసి హోలీ పండుగ జరుపుకున్నారు.

కుటుంబ సభ్యులతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్న పోచారం

బాన్సువాడ: హోలీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని నివాసంలో తన మనుమలు రిషిక్ రెడ్డి, రుషాంక్ రెడ్డిలతో కలిసి హోలి సంబురాలలో పాల్గొని రంగులు చల్లుకున్న ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ అందరూ కలిసి జరుపుకునే హోలీ పండుగ మన అందరి జీవితాల్లో కొత్త రంగులు నింపాలని, కామ దహనం చేసి, రంగులు చల్లుకుని, ఆనందం పంచుకుని అందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు.

నలుగురు బెల్టు షాపుల నిర్వాహకులు అరెస్టు

రామారెడ్డి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో ఇద్దరు, బట్టు తండా, పోసానిపేట్ గ్రామాలకు చెందిన నలుగురు బెల్టు షాప్ దారులను శుక్రవారం అరెస్టు చేసినట్లు రామారెడ్డి ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు. హోలీ పండుగ వేడుకల్లో బంద్ పాటించాలని తెలిసిన ప్పటికీ బెల్టు షాపులు నడిపిస్తూ కొందరు కల్లు దుకాణాలు తెరవడం పట్ల ఎస్సై ఒక్కసారిగా భగ్గుమన్నారు. దీంతో నలుగురు బెల్టు షాప్ దారులను అరెస్టు చేసినట్లు ఎస్సై నరేష్ వివరించారు.

ఇద్దరిపై ఫోర్జరీ కేసు నమోదు

దోమకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి):దోమకొండ గ్రామానికి ఇద్దరు వ్యక్తులు దోమకొండ గ్రామ పంచాయతి సెక్రటరీ యొక్క సంతకాలనీ ఫోర్జరీ చేసి నకిలీ డాక్యూమెంట్లు, నకిలీ రశీదులు క్రియేట్ చేస్తూ ఒక వ్యక్తి మణిపురం గోల్డ్ లోన్‌లో నుంచి గోల్డ్ విత్‌డ్రా చేసుకోవడం జరగిందని ఎస్సై స్రవంతి శుక్రవారం తెలిపారు. మరోక వ్యక్తి కేసు షూరిటీల విషయంలో ఉపయోగించుటకు ప్రయత్నించడం జరిగిందని కావున ఇట్టి విషయంపైపంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు మంగళపల్లి. శ్రావణ్, చింతల రవిందర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

జగదీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ నిరసన

కామారెడ్డిటౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని శాసనసభ సమావేశాల నుంచి సస్పెండ్‌చేయడంపై కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ,మండల అధ్యక్షులు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, పిప్పిరి ఆంజనేయులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలపై ప్రజలు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిలదీస్తుంటే సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యవైఖరిని ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో అన్ని పార్టీలను సమానంగా చూడాలని కేవలం కాంగ్రెస్ పార్టీవైపు ఉండవద్దని మాట్లాడినందుకు ఆ మాటలను వక్రీకరిస్తు సస్పెన్షన్‌కు గురిచేయడం అప్రజాస్వామికమని తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కే సంస్కృతి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు.సీఎంతో పాటు మంత్రులు ఇష్టరితిన ప్రతిపక్ష నాయకులపై మాట్లాడిన స్పీకర్ స్పందించకపోగా వారిని వెనుకేసుకురావడం తెలంగాణ సమాజం చూస్తుందని అన్నారు. వెంటనే జగదీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుంబాలరవియాదవ్, భానుప్రసాద్, గెరి గంటి లక్ష్మీనారాయణ,గోపిగౌడ్,బాలరాజు, మల్లేష్‌యాదవ్, నరేష్‌రెడ్డి, వెంకటి, రాజు, లతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని సస్పెండ్‌కు నిరసనగా శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీలో జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఏకపక్ష నిర్ణయంతో కుట్రపన్ని సస్పెండ్ చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్‌కుమార్, డీసీసీ డైరెక్టర్ కాసాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎరుకల సాయిలు, నాయకులు శ్రావణ్ కుమార్, దేవదాస్, ఇమ్రాన్, బర్కత్ అరవింద్‌గౌడ్, మల్లారెడ్డి, నాగం రాజయ్య, విఠల్ పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జాతీయ రహదారిపై ఆటోను ఢీకొన్న లారీ

● ఆటో డ్రైవర్ మృతి.. పలువురికి గాయాలు

● జిల్లా ఆసుపత్రికి తరలింపు

కామారెడ్డి టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పండుగపూట జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకోవడంతో ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. శుక్రవారం దేవునిపల్లి పీఎస్ పరిధిలోని టెక్రియాల్ వద్ద గల జాతీయ రహదారిపై తమిళనాడుకు చెందిన లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలు కాగా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్ మండలం కుప్రియల్ గ్రామానికి చెందిన అంకం నరేందర్ తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుండగా వెనక నుంచి లారీ వచ్చి ఢీకొనడంతో ఆటో బోల్తాపడింది. దీంతో పలువురు ప్రయాణికులు ఆటోలోంచి కిందపడగా వెంటనే స్థానికులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ నరేందర్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన లక్ష్మణ్, నింబాయిగారి లక్ష్మీ, కుప్రియల్‌కు చెందిన సమీనా, అబ్దుల్ నవి, నర్సవ్వ, మోతె గ్రామానికి చెందిన ఇస్మాయిల్‌లు చికిత్స పొందుతున్నారని తెలిపారు. తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ అతివేగం అజాగ్రత్తతో వాహనం నడిపి ప్రమాదానికి కారణం కావడంతో ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన లారీ

డీఎస్పీని సన్మానించిన బీసీ నేత

ఎల్లారెడ్డి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు బదిలీ అయిన సందర్భంగా శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులకు శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి హోలీ పండుగను పుర స్కరించుకుని రంగులు చల్లకున్నారు. ఈ సందర్భంగా చింతల శంకర్ మాట్లాడుతూ డీఎస్పీ ఎల్లారెడ్డిలో శాంతి భద్రత పరి రక్షణకు ఎంతో కృషి చేశారని, ఎల్లారెడ్డి ప్రజల్లో తనదైన ముద్ర వేసుకున్నారని ఆయన చేసిన సేవలు ఎల్లారెడ్డి ప్రజలు మరువలేరని కొనియాడారు.



ఎల్లారెడ్డ డీఎస్పీకి సన్మానం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్

నేటి నుంచి సిద్ధరామేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

భిక్కనూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. మొదటిరోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, పుణ్యాహవచనము, మాతృకనాంది, అంకురార్పణము, అఖండ దీపారాదన, స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీ సిద్దగిరి సమాధి వద్దకు ఊరేగింపుగా వెళ్లివచ్చుట, 16న ఆదివారం అగ్ని ప్రతిష్ఠ, దేవాతాహోమము, ధ్వజారోహణము, బలిహారణ, ఎడ్లబండ్ల ఊరేగింపు, వీరభద్ర ప్రస్తావన, అగ్నిగుండాలు, 17న సోమవారం శ్రీ సిద్దగిరి సమాధి వద్ద పూజలు, స్వామివారి కళ్యాణం, రాత్రి శ్రీ సదాశివ మహంత్ ఉగ్రరూపుడై శ్రీ సిద్దగిరి సమాధి వద్ద నుంచి ఆలయానికి వచ్చుట, స్వామివారి విమాన రథోత్సవం, 18న మంగళవారం స్వామివారి అవబృధ స్నానం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, 19న బుధవారం నాకబలి, క్షేత్రపాలకబలి, పూర్ణాహుతి, శ్రీ సిద్ధగిరి సమాధి వద్దకు ఊరేగింపుగా వెళ్లి రావడంతో ఉత్సవాలు ముగిస్తాయని తెలిపారు. ఈ ఆలయ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజ యవంతం చేయాలని కోరారు.



స్వామివారి మూలవిరాట్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

